క్లుప్తంగా

రుణాలను వినియోగించుకోవాలి



పెనుమంచిలిలో డ్వాక్రా సంఘాలకు రుణాల చెక్కును అందిస్తున్న బ్యాంక్ అధికారులు

పెనుగొండ: పంటలకు, వ్యాపారాలకు ఇతర రుణాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాడేపల్లిగూడెం రీజనల్ మేనేజరు బి రాజశేఖర్ అన్నారు. శనివారం పెనుమంచిలిలో ఆచంట ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో రైతు, ఖాతాదారుల ఆత్మీయ సదస్సులో పాల్గొన్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ.3 కోట్లు రుణ చెక్కును అందించారు. మారుమూల గ్రామాలకు సైతం బ్యాంక్ సేవలను విస్తృతం చేశామన్నారు. ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా ఎస్‌బీఐ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేశుల శేషవేణి, మండల వ్యవసాయాధికారి కే రాజశేఖర్, వెలుగు ఏపీఎం సతీష్, బీఎం ఎల్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

నగరేశ్వరుని సేవలో న్యాయమూర్తులు



పెనుగొండలో నగరేశ్వరుని దర్శించుకుంటున్న న్యాయమూర్తులు

పెనుగొండ: మహాశివరాత్రి సందర్భంగా పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరుని నరసాపురం అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు, పాలకొల్లు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఉషారాణిలు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కోట్ల రామకృష్ణమోహనరావు, ఆలయ ఈఓ జీఎస్ఎస్ శ్రీనివాస్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

వైవీ రావు మృతి తీరని లోటు

నరసాపురం: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు మృతి కార్మికులకు తీరని లోటని ఆసంఘం నరసాపురం డిపో యూనియన్ నాయకులు అన్నారు. వైవీ రావు సంతాప కార్యక్రమాన్ని శనివారం డిపో గేట్ వద్ద నిర్వహించారు. వైవీ రావు కార్మికుల ప్రయోజనాల కోసమే అనుక్షణం పనిచేశారని అన్నారు. ఆయన లోటు కార్మికులకు తీరని నష్టమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నరసాపురం డిపో అధ్యక్ష, కార్యదర్శులు పి.స్టీవెన్‌రాజు, ఎస్‌పీవీ ప్రసాద్, ఏఎస్ రావు, సీహెచ్ శేషగిరి, డి.శివాజీ పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేకాలంకరణ



వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినం కావడంతో భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై శనివారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, ఒక కోడి పుంజును, రూ.2150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

పెనుమర్రులో..

యలమంచిలి: మండలంలోని పెనుమర్రు గ్రామ శివారున వరి చేలగట్ల వద్ద కోడి పందేలు వేస్తున్నారనే సమాచారంపై శనివారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు వేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.9300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ ఆర్.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధిపై ప్రణాళిక

- నరసాపురం పట్టణంలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు
- అసలు పట్టించుకోని గత పాలకవర్గం
- దశల వారీగా రోడ్లు నిర్మించాలని నిర్ణయం



31వ వార్డు చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కాలనీలో సగం పూర్తిచేసి వదిలేసి అప్రోచ్ రోడ్డు

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో అప్రోచ్ రోడ్ల నిర్మించాలని మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్‌ముదునూరి ప్రసాదరాజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలోనూ, అలాగే చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ వార్డు పర్యటనల నేపథ్యంలో ఈ సమస్య గుర్తించారు. ఎక్కడెక్కడ అంతర్గత రోడ్లు నిర్మించాలనే అంశంపై నివేదిక ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న అంతర్గత రోడ్లు నిర్మాణం జరగబోతుంది. గత పాలకవర్గాలు అంతర్గత రోడ్లు నిర్మాణం విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపాయి. ప్రధాన రహదారులు తప్పిస్తే, కాలనీల్లో అప్రోచ్ రోడ్లను నిర్మించడంలేదు. ఫలితంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఖరుకు భారీగా నిధులు వచ్చిపడిన 2015 పుష్కరాల సమయంలో కూడా వార్డుల్లో ప్రజలు మొరపెట్టుకున్నా గత పురపాలకులు పట్టించుకోలేదు. అప్రోచ్ రోడ్లను నిర్మించలేదు.

ఎన్నో ఇబ్బందులు

పట్టణంలో చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కానీలో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మించారు. కానీ కాలనీ నుంచి ప్రధాన రోడ్డుకు చేరుకోవడానికి అప్రోచ్‌రోడ్లు లేవు. దీంతో మట్టి దిబ్బలను దాటుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి. ఎన్టీఆర్ కాలనీ, నందమూరు కాలనీ, వైఎస్సార్ నగర్, స్టేషన్‌పేట, గ్రేస్‌నగర్, పొన్నపల్లి ప్రాంతాల్లో ఇదేరకమైన ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. వర్షాకాలంలో అయితే జనం నానా అవస్థలు పడుతున్నారు. దళితులు, పేదలు ఎక్కువగా ఉండే 27, 28 వార్డుల్లోనూ, మున్సిపాలిటీ మురికివాడలుగా గుర్తించిన అరుంధతిపేట, మాధవాయిపాలెం ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి. ఇలాంటి రహదారలను అన్నిటినీ దశలవారీగా నిర్మించాలని నిర్ణయించి మున్సిపాలిటీ ముందుకు వెళుతుంది.

నరసాపురం పట్టణంలో రోడ్లు ఇలా	
సీసీ రోడ్లు	- 31.52 కిలో మీటర్లు
బీటీ రోడ్లు	- 15.65 కిలో మీటర్లు
కంకర రోడ్లు	- 7 కిలోమీటర్లు.
కచ్చా రోడ్లు	- 2 కిలోమీటర్లు

అప్రోచ్ రోడ్లన్నీ పూర్తి చేస్తాం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టికి ఎక్కువగా అప్రోచ్‌రోడ్లు సమస్య తీసుకొచ్చారు.. అప్రోచ్‌రోడ్లు లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నిర్మించాల్సిన అప్రో చ్‌రోడ్లు 5 కిలో మీటర్లు వరకూ ఉంటాయి.ఈ వేసవి కాలంలో వాటి నిర్మాణంపై దృష్టిపెడతాం. అవసరమైతే జనరల్ ఫండ్స్ ఖర్చుచేసి నిర్మాస్తాం. ఇప్పటికే కొన్ని వార్డుల్లో అప్రోచ్ రోడ్లు నిర్మించాం.

–బర్రి శ్రీవెంకటరమణ మునిసిపల్ చైర్‌పర్సన్

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



శివదేవునిచిక్కాల శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధిచెందిన శివదేవునిచిక్కాలలో శివాలయ ఆవరణలో భక్తుల కోసం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాకర్స్‌క్లబ్ ర్యాలి శుభ, సభ్యుల విరాళంతో శ్రీరామ పరదేశి నాగసాయి కోలాట భజన బృందం గురువు తంగెళ్ల చిన్న ఆధ్వర్యంలో కోలాట భజన చేసి అలరించారు. అలాగే సంస్కృతి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచార్య పీఎస్ ప్రసాద్ శిష్య బృందం చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు భక్తులకు ఆకట్టుకున్నాయి. భక్త బృందంతో భజన గీతాలు ఆలపించారు.

శివనామస్మరణతో పులకించిన గ్రామాలు



మేడపాడు శివాలయంలో శ్రీఉమారామలింగేశ్వరస్వామి



లక్ష్మణేశ్వరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



ఆచంటేశ్వరుని దర్శించుకుటున్న మాజీమంత్రి శ్రీరంగనాథరాజు దంపతులు



శివదేవునిచిక్కాలలో హారతులిస్తున్న అర్చక స్వామి ర్యాలి సూరిబాబు

- ఉత్సాహంగా శివరాత్రి వేడుకలు
- శివాలయల్లో భక్తుల రద్దీ

పాలకొల్లు సెంట్రల్: మహాశివరాత్రి పర్వదినం సందర్బంగా పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో పులకించింది. శనివారం మహా శివరాత్రి పురస్కరించుకుని భక్తులు వేకువజాము నుండే స్వామి వారిని దర్శించుకోవడానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆలయ అధికారులు, పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. రాత్రి 8.35 గంటలకు జగజ్యోతి వెలిగించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామివారికి మల్లన్న పాగా అలంకరించారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం 6 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. అలాగే ఆలయానికి వచ్చే భక్తులకు శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి సేవా సమితి, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు మరి కొంతమంది దాతలు ఉచిత ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి యార్ల సూర్యనారాయణ, ఎస్సైలు బి శ్రీనివాసరావు, ఎస్.ముత్యాలరావు, రెహమాన్ పాల్గొన్నారు. అలాగే లాకుదిగువ కొత్తపేటలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళీ వీరభద్ర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆన సంబరం ప్రారంభించారు. అనంతరం 108 మంది మహిళలతో కలశాలతో ఊరేగింపు ఏర్పాటుచేశారు. పట్టణంలోని మఠంవీధిలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ఆలయంలో శివరాత్రి పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మఠం వీధిలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా నవరత్నాల శివలింగాలు, మంచు కొండలో శివలింగంగా ప్రత్యేక అలంకరణలు చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేయించుకున్నారు. అభిషేకాలు నిర్వహించుకోవడం కోసం తెల్లవారుజాము నుంచి బారులు తీరారు. సంతాన ప్రాప్తి కోసం భక్తులు ఆలయ ఆవరణలో కొబ్బరిమొక్కలు నాటి భక్తిని చాటుకున్నారు. ఈఓ నామాల రంగరాజన్, దేవస్థానం చైర్మన్ సాధనాల లక్ష్మి, ఉపసర్పంచ్ ఆకుల నాగ మురళి, అర్చకస్వాములు ర్యాలి శివరామకృష్ణప్రసాద్ (సిద్ధాంతి సేవలందించారు. దిగమర్రలోని శ్రీ ఉమా నరేంద్రస్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు. అర్చకస్వామి చేబ్రోలు శ్రీనివాస రామమూర్తి, ఈవో యార్ల సూర్యనారాయణ భక్తులకు సేవలందించారు. అలాగే దగ్గులూరులో వేంచేసియున్న శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా శనివారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నరసాపురంలో...

నరసాపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని శనివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలు కిటకిటలాడాయి. ప్రసిద్ధ కపిలమ్మేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే అభిషేకాలు నిర్వహించారు. శనివారం త్రయోదశి కూడా రావడంతో శనీశ్వర పపూజలు కూడా చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ వెన్నా ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు మండా రాజా, ఛౌడేశ్వరి దేవాంగ సంక్షేమసంఘం వారు పులిహోర పంపిణీ చేశారు. అలాగే గోదావరి తీరంలో ఉన్న అమరేశ్వరస్వామి ఆలయం కూడా భక్తులతో కిక్కిరిసింది.

మొగల్తూరులో..

మొగల్తూరు: స్థానిక వడయార్‌పేటలోని స్వయంభూలింగేశ్వర వనమల్లికార్జుని స్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. స్థానిక పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ, ముత్యాలపల్లి భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలోను, కాళీపట్నం కాళీకేశ్వరస్వామి ఆలయంలోను, పేరుపాలెం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోను, కొత్తపాలెం వీరభద్రస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు.

లక్ష్మణేశ్వరంలో..

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలోని పురాణ ప్రసిద్ధిగాంచిన దుర్గా లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయం శివనామంతో మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీదుర్గాలక్ష్మణేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునుండే పెద్దెత్తున భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. సుమారు లక్ష మంది భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడులు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని కై ల సత్యనారాయణ, బాలం నాగేశ్వరరావు, గోగులమ్మ అన్నదాన ట్రస్ట్ (పరసావారి మెరక), కడలి పద్మరాజు అండ్ ఫ్రెండ్స్, గన్నాబత్తుల ఆంజనేయులు గారి కుమారులు తదితరులు స్వచ్ఛందంగా అన్నసమారాధనలు నిర్వహించారు. కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు, రాజుల్లంక క్షత్రియ సేవా సమితి, విశ్వహిందూ పరిషత్ తదితరులు మినరల్ వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ, అల్పాహార పొట్లాలను భక్తులకు అందించారు. ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు దొంగ మురళీకృష్ణ, చాగంటి సత్యనారాయణ, వెన్నా మురళీకృష్ణ పాల్గొన్నారు.

శివాలయాల్లో పోటెత్తిన భక్తులు

పెనుమంట్ర: ప్రసిద్ధ శైవక్షేత్రాలైన సత్తారామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి గ్రామాల్లోని రామేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, అగస్త్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం తెల్లవారు జామునుంచే ఈఆలయాల వద్ద భక్తులు పుణ్య స్నానాలుఆచరించి, స్వామివార్లను దర్శించుకునేందుకు క్యూలు కట్టారు. జుత్తిగ సోమేశ్వర ఆలయంలో ఉదయం నుంచి మహిళలు పెద్ద ఎత్తున సోమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. జుత్తిగ, సత్తారామేశ్వరం ఆలయాల వద్ద దాతల సహకారంతో అన్నసమారాధన చేశారు. జుత్తిగ, సత్తారామేశ్వరం గ్రామాల్లో సుమారు 80వేలకు మందికి పైగా భక్తులు స్వామివార్లను దర్శించుకుని అన్నప్రసాదాలను స్వీకరించారు. మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైజయంతి దంపతులు శనివారం మహా శివరాత్రిని పురస్కరించుకుని జుత్తిగ గ్రామంలోని సోమేశ్వరుడిని, సత్తారామేశ్వరం గ్రామంలోని రామేశ్వరుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మధ్యాహ్నం మూడు దేవాలయాల వద్ద రథోత్సవాలను ప్రారంభించారు. అనంతరం జుత్తిగ, సత్తారామేశ్వరం పాలమేర్లలో సోమేశ్వరస్వామి, రామేశ్వరస్వామివార్లకు ఎదురు సన్నాహ ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

భక్తులతో ఆచంటేశ్వరుని ఆలయం కిటకిట

పెనుగొండ: మహాశివరాత్రి సందర్భంగా ఆచంటలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఆచంటేశ్వరాలయం శనివారం భక్తులతో పోటెత్తింది. శ్రీస్వామివారి దర్శనం కోసం భక్తులు తెల్లవారుజామునుంచే బారులు తీరారు. మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరకువాడ శ్రీరంగనాథరాజు దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసాపురం డివిజన్ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో క్యూలైన్‌లో నిలుచుకున్న భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాటర్ ప్యాకెట్లు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి రామచంద్రకుమార్, కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శ్రీస్వామి వారి రథోత్సవం వేడుకగా సాగింది. పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆచంట సర్పంచ్ కోట సరోజిని, కార్యదర్శి నాగబాబు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

వైభవంగా శివరాత్రి వేడుకలు

పోడూరు: మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో శనివారం మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పెనుమదంలోని శ్రీ ఉమా అగస్త్యేశ్వరస్వామి, పోడూరులో శ్రీ మూలేశ్వర, రాజేశ్వర, కేశవస్వామి, జిన్నూరులో శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి, గుమ్మలూరులో శ్రీ సోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, విశేషపూజలు ఘనంగా నిర్వహించారు. జిన్నూరులో శ్రీ అన్నపూర్ణేశ్వరిదేవి ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు

యలమంచిలిలో..

యలమంచిలి: మహా శివరాత్రి ఉత్సవాలను శనివారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శివరాత్రి సందర్భంగా మేడపాడు, యలమంచిలి, అబ్బిరాజుపాలెం, చించినాడ, బాడవ, ఏనుగువానిలంక, బూరుగుపల్లి, దొడ్డిపట్ల, గుంపర్రు, ఇలపకుర్రు గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. శనివారం తెల్లవారుజామునే శివలింగాలకు పంచామృతాభిషేకా చేశారు. ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.



కపిల మల్లేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం



వనమల్లిఖార్జున స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



క్షీరారామంలో ఆకట్టుకున్న అలంకరణ



జుత్తిగ సోమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న దృశ్యం

క్షయ వ్యాధిపై అవగాహన



క్షయవ్యాధి పట్ల అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పోడూరు: క్షయవ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకంగా మారుతుందని హెల్త్ సూపర్‌వైజర్ జయమణి హెచ్చరించారు. పెనుమదం గ్రామంలో శనివారం క్షయవ్యాధిపట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జయమణి మాట్లాడుతూ 2 వారాల పాటు దగ్గు, దగ్గినపుడు కళ్లెతో పాటు రక్తపు చారలు కనిపించడం, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధి కావచ్చనీ, కాబట్టి ఈ లక్షణాలు కనిపించినపుడు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఒకవేళ క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఏ మాత్రం ఆందోళన చెందవద్దనీ, కొద్దిరోజుల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం సుబ్బాయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ వై.శ్రీధర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవాలు



లక్ష్మణేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



నగరేశ్వరునికి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మణేశ్వరంలోని శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామివారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకు వచ్చి రథంలో ఉంచారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. రథోత్సవానికి ముందు కుంభం పోసి స్వామివారికి నైవేద్యం చూపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు యలమంచిలి ప్రసాదశర్మ, ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు,ఈఓ చాగంటి సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఓం న మఃశ్శివాయ నామస్మరణతో పెనుగొండ మండలంలో శివాలయాలు హోరెత్తాయి. శనివారం మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు అన్ని భక్తులతో కిటకిటలాడాయి, పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, ఉమామహేశ్వర స్వామి ఆలయం, ఉమాఏకాంబరేశ్వర ఆలయం, చెరుకువాడలో ఉమా విశ్వేశ్వర స్వామి ఆలయం, సిద్ధాంతంలో కేదారేశ్వర, నందీశ్వర స్వామి దేవలో చంద్రశేఖర ఆలయం, ఇలపర్రులో శివాలయం, వడలిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు భారులు తీరారు. తెల్లవారు జాం నుంచి అభిషేకంలు నిర్వహించి, శివలింగాలను అలంకరించారు. సిద్ధాంతంలో వీరభద్రుని ప్రభల సంబరం కనుల పండుగగా నిర్వహించారు. పెనుగొండ నగరేశ్వరుని రథోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నగరేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట రామకృష్ణ మోహనరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ ఎస్ శ్రీనివాస్, ట్రస్టీలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.